## క్లుప్తంగా

### అప్రమత్తంగా ఉండాలి..



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శిరీష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు సూచించారు. ఆదివారం స్థానిక జెడ్పీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రజలకు సహాయ, సహకారాలు అందించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందని చెప్పారు. వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్న వారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత ఇళ్ల గోడలు నాని కూలిపోయే అవకాశం ఉన్నందున ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల అనంతరం వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటి నుంచే ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

### పునరావాస కేంద్రాలకు తరలింపు



సంతగవిరమ్మపేటలోని పునరావాస కేంద్రంలో ప్రజలకు సూచనలు ఇస్తున్న హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ

శృంగవరపుకోట: మండల వ్యాప్తంగా శని, ఆదివారాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. వాగులు, వంకలు, గెడ్డలు, పొంగి పొర్లుతున్నాయి. పోతనాపల్లి వద్ద మద్దిగెడ్డ పొంగడంతో రోడ్డు మీద, పొలాల్లో నీరు చేరింది. ఆ పంచాయతీ పరిధిలోని రొంగలి కళ్లాల్లో నివాసం ఉంటున్న 11 కుటుంబాలకు చెందిన 40మందిని, సంతగవిర మ్మపేట పంచాయతీ పరిధిలో ఎరుకుల కాలనీకి చెందిన 20 మందిని అధి కారులు ఆదివారం సాయంత్రం పునరావాస కేంద్రాలకు తరలించారు. రొంగలి కళ్లాల వారికి సంతగవిరమ్మపేట ప్రాథమి కోన్నతపాఠశాలలో, ఎరుకుల కాలనీ వాళ్లకు వెల్‌నెస్ సెంటర్‌లో పునరావాసం ఏర్పాటు చే శారు. వీఆర్‌ఓ ఎస్.చంద్రరావు, పంచా యతీ కార్యదర్శి కె.లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం కె.బంగారునాయుడు పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి కావాల్సిన ఆహారం, తాగునీరు, మందులు, వసతి సౌకర్యాలను సమకూర్చుతున్నారు.

### అనారోగ్యంతో ఎస్‌ఐ మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

కొత్తవలస: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వర్లు కొద్దిరోజులుగా అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఈయన విశాఖపట్నం కంట్రోల్ రూమ్ నుంచి గతేడాది బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మృతిపై సీఐ షణ్ముకరావు,ఎస్‌ఐ సుదర్శన్,పోలీస్ సిబ్బంది సంతాపం తెలి పా రు. వెంకటేశ్వర్లు అంత్యక్రియలను ఆయన కుటుంబ సభ్యులు పాడేరులో ఆదివారం నిర్వహించారు.

### యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

చీపురుపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఈ వేడుకలను యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు ప్రారంభించారు. ఉపాధ్యాయులకు చదరంగం, క్యారమ్స్, షటిల్, తదితర ఆటల పోటీలు నిర్వహించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో రెడ్డి మోహనరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై యూటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్ర నాయకుడు డి. రాము, జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, నాలుగు మండలాల యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### జీఓ 114ను అమలు చేయాలి

లక్కవరపుకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 114 ను తక్షణమే అమలు చేయాలని ఎస్.కోట నియోజకవర్గం పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు కోరారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని స్థానిక క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం కలిసి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులుగా పని చేస్తున్నామని, గత ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసేందుకు జీఓ ఇచ్చినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా అమలు కాలేదని చెప్పారు. తమ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేని కోరారు.

# వర్ష బీభత్సం

అల్పపీడన ప్రభావంతో శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లో శనివారం, ఆదివారం కుండపోత వర్షం కురిసింది. ఎడితెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాల్లో చెరువులకు గండ్లు పడ్డాయి. రహదారులు చెరువు లను తలపిస్తుండగా..వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గెడ్డలు, వాగుల వద్ద కల్వర్టులపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించి పోయాయి.వందల ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. సోమవారం సైతం వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- పొంగిపొర్లుతున్న గెడ్డలు, వాగులు
- వందల ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు
- పలు చెరువులకు గండ్లు



మెరకముడిదాం: చెరువును తలపిస్తున్న బుధరాయవలస-మెరకముడిదాం ప్రధానరహదారి



గుర్ల: ఆనందపురంలో చంపావతి నది వరద ఉధృతిని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్



గంట్యాడ: పెదవేమలి వద్ద కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ



బొండపల్లి: బొడసింగిపేటలో నీటి మునిగిన వరి పంట



కొత్తవలస: మండల కేంద్రంలోని వీరసాగరం చెరువు గట్టును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ



చీపురుపల్లి: నాగంపేట వద్ద ఎర్ర చెరువుకు గండి పడడంతో పంట పొలాల్లోకి వెళుతున్న నీరు



కొత్తవలస: కొత్తవలసలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఓ ఇంటిలోకి ప్రవేశించిన వరదనీరు



గుర్ల: జమ్ముపేట రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద వరద నీటిలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు



చీపురుపల్లి: నాగంపేటలో కూలిపోయిన ప్రాథమిక పాఠశాల ప్రహరీ



లక్కవరపుకోట: గొల్జాం సమీపంలో కోతకు గురైన రోడ్డు మధ్యలో కర్రలతో బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు



జామి: తాండ్రంగిలో గోస్తనీ నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణలత



బొండపల్లి: చెరువుకు గండిపడడంతో ఎం.కొత్తవలస-పెద్దమజ్జిపాలెం రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



గుర్ల: గుర్లలో నీటి మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ తిరుపతిరావు



మెరకముడిదాం: గర్భాం- గరివిడి ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద



చీపురుపల్లి: గొల్లలములగాం పెద్ద చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు



దత్తిరాజేరు: దత్తి గ్రామ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చేరిన వరద నీరు

#### నాగంపేట చెరువుకు గండి

చీపురుపల్లి: గొల్లలములగాం గ్రామంలో పెద్ద చెరువు గండి కొట్టే స్థితిలో ఉండడంతో తహసీల్దార్ రాజారావు పరిశీలించారు. నా గంపేటలో ఎర్రచెరువు గండి కొట్టడంతో పంట పొలాలు నీటమునిగాయి.గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిపోయింది. చీపురుపల్లిలోని అంజనేయపురంలో పెట్రోల్ బంక్ వెనుక బోను ఆదిలక్ష్మి నివాసంలోకి వరద నీరు చేరింది. సమాచారం తెలుసుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ సిబ్బందితో వెళ్లి వర్షపు నీరు మళ్లించే చర్యలు చేపట్టారు.

#### ప్రమాదకర స్థితిలో చెరువులు

బొండపల్లి: బోడసింగిపేటలో జాతీయ రహదారి-26కు ఆనుకుని ఉన్న చలి చెరువు కొమ్ముపారడంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో దిగువన ఉన్న సుమారు 20 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. ఎం.కొత్తవలస-పెద్దమజ్జిపాలెం గ్రామాలకు ఎగువన ఉన్న అనార్ చెరువుకు గండి పడడంతో వరద నీరు రోడ్డుపై ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. జాతీయ రహదారి-26 కు ఆనుకుని ఉన్న నెలివాడలోని రామన్న సాగరం, బొండపల్లిలోని రాజు చెరువు పూర్తి స్థాయిలో నిండి ప్రమాదకర స్థితిలో ఉండడంతో అధికారులు పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

#### ఇళ్లలోకి వరద నీరు

దత్తిరాజేరు: దత్తి గ్రామ సమీపంలో చెరువు పూర్తి స్థాయిలో నిండడంతో ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది.దీంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. గడసాం-పోరలి గ్రామాల మధ్య బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్న చోట వరద నీటి ప్రవాహం వల్ల రాకపోకలు నిలిచి పోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. టి-భూర్జవలస సమీపంలోని గోపాలసాగరం చెరువు కొమ్ముపారి గ్రామం మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

#### అప్రమత్తం ...

జామి: మండలంలో రహదారులు జలమయ్యాయి.వాగులు,వంకలు,నదులు పొంగిప్రవహిస్తున్నాయి. పంటపొలాలు నీటమునిగాయి. తాటిపూడి జలాశయం గేట్లు ఎత్తివేయడంతో గోస్తనీ నదీపరివాహక ప్రాంత గ్రామాల్లో రెవెన్యూ అధికారులు దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. లొట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో చెట్లు విరిగిపోవడంతో పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహం దెబ్బతింది.

#### నిలిచిన రాకపోకలు

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట, వసంత గ్రామాలకు వెళ్లే మార్గంలో గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామాలకు రాక పోకలు బంద్ అయ్యాయి. అలాగే లక్కిడాం నుంచి వసంత గ్రామానికి వెళ్లే రోడ్డులో గెడ్డ, అలాగే పెదవేమలి నుంచి విజయనగరం మండలంలోని పినవేమలి గ్రామానికి మధ్య ఉన్న గెడ్డ ఉధృతి తో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయా యి.

#### కోతబారిన రోడ్డు

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం రహదారిలో భారీ వృక్షాలు నేలకొరగడంతో తహసీల్దార్ ప్రసాదరావు సిబ్బందితో కలిసి వాటి తొలగింపు పనులు చేయించి, రాక పోకలకు అంతరాయం లేకుండా చేశారు. అదే రోడ్డులో గొల్జాం గ్రామ సమీపంలో రోడ్డు కోతబారింది.

#### ఆర్టీసీ కాంప్లెక్స్‌ను చుట్టుముట్టిన వరద

కొత్తవలస: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను వరద నీరు చుట్టుముట్టింది. సమీపంలోని ఇళ్లలోకి, సామిల్లుల్లోకి వరద నీరు చేరింది. సామిల్లుల్లో యంత్రాలు, కలప నీటమునిగాయి. ఆర్టీసీకాంప్లెక్‌లో వరద నీటిని బయటకు తరలించే పనులను తహసీల్దార్ నీలకంఠరావు, ఈఓపీఆర్డీ ధర్మారావు సిబ్బందితో కలిసి చేయించారు. మండల కేంద్రంలోని వీరసాగరం చెరువును విజయనగరం ఆర్డీఓ ఎం. వి.సూర్యకళ ఆదివారం పరిశీలించారు.

#### నీట మునిగిన బస్సు

గుర్ల: విజయనగరం నుంచి మండలంలోని నాగళ్లవలస మీదుగా 20 మంది ప్రయాణికులతో చీపురుపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు జమ్ముపేట రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద నీటిలో ఆదివారం మునిగిపోయింది. బస్సు మోరాయించి వరద నీటిలో ఆగిపోవడంత ప్రయాణికులు ఆందోళన చెందారు. తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి అక్కడికి చేరుకుని ట్రాక్టర్ సహాయంతో బస్సును బయటకు తీయించారు. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. కెల్ల గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సోలిపి సోమరాజుపేట గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తహసీల్దార్ సూచించారు. ఆనందపురం వద్ద చంపావతి నదిని కలెక్టర్ అంబేడ్కర్ ఆదివారం పరిశీలించారు.

#### నివాస ప్రాంతాల్లోకి వరదనీరు

గజపతినగరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయమైంది.రంగుపురం,ఎం.కొత్తవలస గ్రామాలకు వెళ్లే రోడ్లు వరదనీటితో చెరువులను తలపించాయి. ఆ మార్గాల్లో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.గజపతినగరం,పురిటిపెంట న్యూకాలనీ తదితర ప్రాంతాల్లో నివాస ప్రాంతాలను వరద నీరు చుట్టు ముట్టడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి దాపురించింది.

#### కొమ్ముపారుతున్న చెరువులు

వేపాడ: వేపాడలోని తోముచెరువు, బానాది సమీపంలోని కండిపల్లి వాని చెరువు, తదితర గ్రామాల్లో చెరువులు కొమ్ము పారుతున్నాయి.

#### చెరువులను తలపించేలా...

మెరకముడిదాం: మండలంలోని పలు గ్రా మా ల రోడ్లు చెరువులను తలపించాయి. గర్భాం -గరివిడి ప్రధాన రహదారిపై ఆంధ్రా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ ఎదురుగా, బుధరాయవలస- మెరకముడిదాం రోడ్డులో బుధరాయవలస జీడిపప్పు పరిశ్రమ వద్ద రోడ్డుపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడ్డారు.



వేపాడ: బానాది చెరువు కొమ్ము పారుతుండడంతో చేపలు పడుతున్న గ్రామస్తులు



దత్తిరాజేరు: టి.భూర్జవలస గ్రామంలోని ఓ వీధిలో ప్రవహిస్తున్న వరద నీరు



జామి: శాశనపల్లిలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు



జామి: లొట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహంపై కూలిన చెట్టు



గంట్యాడ: పెదవేమలిలో నీట మునిగిన పంట పొలాలు



కొత్తవలస: జలమయమైన కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్



లక్కవరపుకోట: గొల్జాం రోడ్డులో నేలకొరిగిన చెట్ల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

### కూలిన ఇళ్లు

గంట్యాడ: భారీ వర్షానికి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రాళ్లపూడి సంతోషి కుమారికి చెందిన శ్లాబు ఇల్లు ఆదివారం ఉదయం 6:30 గంటల సమయం లో కూలి పోయింది. ప్రమాద సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

గజపతినగరం: మండలంలోని దావాలపేట గ్రామానికి చెందిన పోలిపిల్లి శ్రీను కుటుంబం నివాసం ఉంటున్న రేకుల షెడ్ వర్షాలకు శనివారం సాయంత్రం కూలిపోయింది.స్థానిక వీఆర్‌ఓ విష్ణు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు.

మెరకముడిదాం: శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆదివారం తెల్లవారు జామున గర్భాం గ్రామంలోని తాశా భక్తుల శ్రీను అనే వ్యక్తికి చెందిన మిద్దె ఇల్లు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇల్లు కూలిపోవడంతో తాము నిరాశ్రయులమయ్యామని, తమను ప్రశభుత్వమే ఆదుకోవాలని బాధితులు వేడుకుటుంన్నారు.



గంట్యాడలో కూలిపోయిన శ్లాబు ఇల్లు



మెరకముడిదాం మండలం గర్భాంలో కూలిన మిద్దె ఇల్లు



గజపతినగరం మండలం దావాలపేటలో కూలిన రేకుల షెడ్

## జై గణేశా పాహిమాం

చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లో వాడ వాడలా వినాయ చవితి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇళ్లల్లో గణనాథులను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అలాగే ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పట్టణాలు, గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద మండపాలు ఏర్పాటు చేసి విభిన్న రూపాల్లో ఉన్న భారీ గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరివిడిలో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, లావణ్య దంపతులు తమ నివాసంలో 650 వినాయక ప్రతిమలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట: ఖాసాపేటలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు



వేపాడ: వేపాడలో పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



చీపురుపల్లి: జి.అగ్రహారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సోషల్ మీడియా వినాయకుడు



చీపురుపల్లి:జి.అగ్రహారంలో దుర్గాదేవి అవతారంలో కొలువు దీరిన వినాయకుడు



చీపురుపల్లిరూరల్(గరివిడి): జెడ్పీటీసీ శ్రీనివాసరావు నివాసంలో ఏర్పాటు చేసిన వినాయక బొమ్మల కొలువు



దత్తిరాజేరు: గడసాంలో పూజలు చేస్తున్న భక్తులు



గుర్ల : గుర్లలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు



గజపతినగరం: గజపతినగరంలోని బూర్లి వీధిలో వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న యూత్